నమస్తే తెలంగాణ

# జనగామ

5 | వరంగల్, మంగళవారం 8 అక్టోబర్ 2024 | JANAGAON


## లలిత మహా త్రిపుర సుందరిగా భద్రకాళీ


**ఐదవ రోజుకు చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు**

వరంగల్, అక్టోబర్ 7 : భద్రకాళీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం భద్రకాళీ అమ్మవారు లలిత మహా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అర్చకులు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం అమ్మవారిని లలిత మహా త్రిపుర సుందరిగా అలంకరించారు. ఉదయం పల్లకీ వాహన సేవ, సాయంత్రం శేష వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి దర్శించుకున్నారు.



వరంగల్ : లలితా మహా త్రిపుర సుందరి అలంకరణలో భద్రకాళీ అమ్మవారు





కాంగ్రెస్‌లో విచిత్ర పరిస్థితులు కనిపిస్తున్నాయి. రేవంత్‌రెడ్డి సర్కారు కొలువుదీరి పట్టుమని పది నెలలు కూడా కాకముందే ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలకు పొసగక వ్యతిరేక పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ఇద్దరు మంత్రులతో సఖ్యత లోపించి దూరం దూరంగా ఉంటూ ఏ ప్రభుత్వ అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు పిలువడం లేదు. ఒకవేళ అమాత్యులు పర్యటనలకు వచ్చేందుకు ప్రయత్నించినా అడ్డంకులు సృష్టిస్తూ వ్యూహాలు పన్నుతున్నట్లు స్పష్టమవుతోంది. అదీగాక పార్టీ కార్యక్రమాల్లోనూ ఎవరికి వారే అన్నట్లు ఉంటున్నారు. ముఖ్యమంత్రి వచ్చినప్పుడు మాత్రం తప్పదన్నట్లు అందరూ ఒకచోట కనిపిస్తున్నా మిగతా సమయాల్లో మంత్రులను అస్సలు పట్టించుకోవడం లేదు. ఒక్కోసారి వీరిద్దరూ కాదని ఇన్‌చార్జి మంత్రి పర్యటించడమూ ఇందుకు బలం చేకూర్చుతున్నది. ఇలా ఒకటీరెండు చోట్ల మాత్రమే కాదు.. ఉమ్మడి జిల్లాలోని అన్ని సెగ్మెంట్లలోనూ మంత్రులను పట్టించుకోకుండా ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరు పార్టీ ఉనికిని ప్రమాదంలో పడేసేలా ఉన్నదనే చర్చ జరుగుతోంది.

*- వరంగల్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# పిలువరు పట్టించుకోరు..

## మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు

**ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో విచిత్రంగా ఆధిపత్య పోరు**

- ఏ కార్యక్రమానికీ ఆహ్వానించరు
- ఒకవేళ రావాలనుకుంటే అడ్డంకులు
- రోజురోజుకూ పెరుగుతున్న అంతరం
- పార్టీ ఉనికికే ఇబ్బందికరంగా పరిస్థితులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఉమ్మడి వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్కకు మంత్రి పదవులు దక్కాయి. ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. అయితే పది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మంత్రులు అధికారికంగా పర్యటించని అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగే ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాలు మినహా మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి ఒక్క కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. పార్టీ కార్యక్రమాల గురించి ఇక చెప్పనక్కర్లేదు. ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా మంత్రులను మాటమాత్రంగా అయినా పిలువడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించినప్పుడు తప్ప అభివృద్ధి పనుల్లో మంత్రులతో ఎమ్మెల్యేల తీరు అంతంత మాత్రంగానే ఉండడంతో.. ఆయా శాఖల నుంచి కొత్త పనులకు నిధుల విషయంలో ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు మంత్రులు ఆమోదం తెలుపడం లేదు.

- మంత్రులు కొండా సురేఖ, సీతక్కలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోకి ఆహ్వానం ఉండడం లేదు. మంత్రి సురేఖకు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఏండ్లుగా విభేదాలు ఉన్నాయి. అధికార పార్టీలోని వీరిద్దరి మధ్య విభేదాలు అలాగే కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లో మంత్రి సురేఖ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ఒక్క కార్యక్రమానికీ హాజరు కాలేదు. మంత్రి సీతక్క సైతం ఈ సెగ్మెంట్‌లో ఇప్పటివరకు ఒక్క కార్యక్రమానికి రాలేదు. స్థానిక ఎమ్మెల్యే నుంచి ఆహ్వానం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉన్నదని తెలుస్తున్నది.
- పరకాల నియోజకవర్గంలోనూ మంత్రి సురేఖ ఒక్క కార్యక్రమానికీ హాజరుకాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, మంత్రి కొండా సురేఖకు మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు ఉన్నాయి. పరకాల ఆధిపత్య పోరు విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ శ్రేణులు వీరిద్దరి గ్రూపులుగా వ్యవహరిస్తున్నారు. మరో మంత్రి సీతక్క పరకాల నియోజకవర్గంలోనూ ఇప్పటివరకు ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనలేదు.
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి.. కాంగ్రెస్‌లో సీనియర్‌గా ఉన్నారు. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన తనకు కాకుండా వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చిన సురేఖకు, కొత్తగా సీతక్కకు మంత్రి పదవి ఇవ్వడంపై మాధవరెడ్డి అసంతృప్తితో ఉన్నారు. ఈ కారణంతోనే ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు మాధవరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలువలేదని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. ఇటీవల మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహను మాధవరెడ్డి ఆహ్వానించారు. అధికారిక కార్యక్రమం కావడంతో అధికారుల ఆహ్వానం మేరకు జిల్లా మంత్రి కొండా సురేఖ వెళ్లారు. ఈ ఒక్కటి తప్పితే నర్సంపేటలోని ఏ కార్యక్రమంలోనూ మంత్రులు సురేఖ, సీతక్క వెళ్లలేకపోయారు.
- బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి.. ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో ఆధిపత్య పోరు మొదలైంది. స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమానికి ఇద్దరు మంత్రులు ఇప్పటివరకు హాజరుకాలేదు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి కొండా సురేఖ.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి వెళ్లేందుకు ప్రయత్నించగా కడియం శ్రీహరి వద్దని చెప్పారు. ఈ విషయంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత ఇదే పరిస్థితి కొనసాగుతున్నది.
- పాలకుర్తి నియోజకవర్గంలోనూ ఇద్దరు మంత్రుల పర్యటనలు దాదాపు ఉండడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఒకటీరెండు సార్లు పర్యటనలు తప్పితే అధికార కార్యక్రమాల్లో మంత్రులు ఎక్కడా పాల్గొనలేదు. ఇద్దరు మంత్రులతో పాలకుర్తి ఎమ్మెల్యేకు ఉన్న విభేదాల కారణంగానే ఈ పరిస్థితి ఉన్నది.
- వర్ధన్నపేట నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులకు తనతో సంబంధం లేకుండానే ప్రాధాన్యత ఇస్తున్నారనే కారణంతో ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రులతో అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. నియోజకవర్గంలో జరిగే ఏ కార్యక్రమానికి మంత్రులను ఆహ్వానించడం లేదు. పరామర్శలు, ప్రైవేట్ కార్యక్రమాల్లోనే ఈ సెగ్మెంట్‌లో మంత్రులు కనిపిస్తున్నారు.
- మహబూబాబాద్, నర్సంపేట నియోజకవర్గాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు మంత్రులు సురేఖ, సీతక్కలకు ఆహ్వానమే ఉండడం లేదనే చర్చ జరుగుతున్నది. వీరిద్దరు మంత్రులను కాదని.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ రెండు సెగ్మెంట్లలోని కార్యక్రమాలకు అప్పుడప్పుడు హాజరవుతున్నారు. ఇటీవల భారీ వానలతో వరదలు వచ్చిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటనకు ముందు సీతక్క పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినప్పుడు ఆయన వెంట ఉన్నారు. కొండా సురేఖ ఈ రెండు సెగ్మెంట్లలో ఇప్పటివరకు ఏ కార్యక్రమానికీ హాజరు కాలేదు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

## చౌకబారు మాటలకు రేవంత్ రోల్‌మోడల్

**సీఎం అనే విషయాన్ని మరచిపోయాడు**

- ఇంకా ప్రతిపక్ష నాయకుడే అనుకుంటున్నడు
- కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం
- మంత్రి సురేఖ వరంగల్ ఇజ్జత్ తీయొద్దు
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

కురవి, అక్టోబర్ 7: రేవంత్‌రెడ్డి తాను సీఎం అనే విషయాన్ని మరచిపోయాడని, ఇంకా ప్రతిపక్షంలో ఉన్నాననుకొని ప్రవర్తిస్తూ చౌకబారు మాటలకు రోల్‌మోడల్‌గా మారాడని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. కురవిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత బలాన్ని చేకూర్చాలని ఇలవేల్పు వీరభద్రుడిని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ఉండి కళ్లు పీకుతా.. కొడుకుల్లారా.. గోలీలు ఆడుకుంటా.. ఇటువంటి చౌకబారు మాటలకు సీఎం రేవంత్ రోల్ మోడల్‌గా నిలిచాడన్నారు. ముఖ్యమంత్రి పదవికి గౌరవం రోజురోజుకూ తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బీఆర్‌ఎస్, మాజీ సీఎం కేసీఆర్ ప్రాబల్యం తగ్గాలని రేవంత్‌రెడ్డి అపసోపాలు పడుతున్నారన్నారు. తెలంగాణ ప్రజలు ఎన్నిరోజులైనా కేసీఆర్‌ను మరిచిపోరనేది నిజం అన్నారు. ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని.. కేసీఆర్‌ను తట్టుకోలేమని రేవంత్ శిఖండిల్లా మహిళా మంత్రులను ముందు పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు. మహిళ అయి ఉండి.. సభ్య సమాజం తలదించుకునేలా మంత్రి కొండా సురేఖ మాట్లాడిన తీరు విచారకరమన్నారు. నోటితో మాత్రమే అధికారంలోకి వచ్చాం.. అదే నోరుతో ఐదేండ్లు పాలిస్తామంటే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదన్నారు. వరంగల్ జిల్లా పోరుగల్లు.. ఎంతో ఘనచరిత్ర ఉందని, సమ్మక్క సారలమ్మ, రాణీ రుద్రమదేవి పుట్టిన గడ్డ ఇజ్జత్ తీయొద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలల్లో 10శాతం కూడా హామీలు అమలు చేయలేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలనే తపనతో పాలన సాగించారన్నారు. గతంలో బతుకమ్మ చీరలు చౌకబారువన్నరు.. మీరు ఇంక మంచి చీరలు ఇవ్వండి. రూ. 500 ఎప్పుడు ఇస్తారో చెప్పాలన్నారు. రైతుకు కాలానికనుగుణంగా రైతుబంధు ఇవ్వాలని, ఎన్నికలు వచ్చినప్పుడు కాదన్నారు. రైతు బంధు, రైతు రుణమాఫీ, నెలకు రూ. 2500.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో పథకాలు అమలు కావడం లేదన్నారు. పరిపాలనను గాలికి వదిలేస్తే మిమ్మల్ని ప్రజలు వదలిపెట్టరన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడన్నారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్‌ను దక్కించుకోవడానికి ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలు నష్టపోతే వారి తరపున పోరాడేందుకు బీఆర్‌ఎస్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. ముందుగా ఇటీవల మృతి చెందిన నూకల నరేశ్‌రెడ్డిని గుర్తు చేసుకుని సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, నూతక్కి నర్సింహారావు, ఐలి నరహరి, బోడ శ్రీను, గుగులోత్ నెహ్రూ, పద్మ, మన్యు ప్యాట్నీ, బాదె నాగయ్య, కిషన్‌నాయక్, సూరయ్య, శ్రీనివాస్, భద్రు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మేడారంలో మొక్క ముడుపు

- సారలమ్మ పూజారుల సంఘం ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- భక్తి, సంస్కృతి మేళవింపుతో పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రయత్నం

తాడ్వాయి, అక్టోబర్7: సమ్మక్క-సారలమ్మ పూజారుల సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం 'వన దేవతలకు మాటిద్దాం-మొక్క ముడుపు చెల్లిద్దాం' అనే నినాదంతో ఒక వినూత్నమైన మొక్క ముడుపు అనే గ్రామ పండుగకు శ్రీకారం చుట్టనున్నారు. భక్తి, సంస్కృతీ సంప్రదాయాల ద్వారా పర్యావరణ పరిరక్షణ దిశగా చేస్తున్న ప్రయత్నంలో మేడారం గ్రామం తొలి అడుగు వేయబోతోంది. దీనిలో భాగంగా నార్లాపూర్, చింతల్‌క్రాస్‌రోడ్ వద్ద నేడు ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ప్రజలంతా హాజరుకావాలని మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు. అడవుల పునరుద్ధరణ, ప్లాస్టిక్ వినియోగం, విష సంస్కృతిని తగ్గించేందుకు వన భోజన సంస్కృతిని ప్రపంచ పండుగలా పరిచయం చేస్తున్న గ్రామ పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదర్శవంతమైన సుస్థిర మేడారం దిశగా వేస్తున్న తొలి అడుగు ఈ చిరు ప్రయత్నంలో కుటుంబ సభ్యులందరితో తప్పకుండా పాల్గొనాలని ఆయన కోరారు.

## నర్సంపేట మున్సిపాలిటీ ఇక కార్పొరేషన్..!

- పది గ్రామాల విలీనానికి ప్రతిపాదనలు
- ఎన్నికలకు ముందే పూర్తిచేసేలా ప్రక్రియ
- కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం

నర్సంపేట, అక్టోబర్ 7 : నర్సంపేట మున్సిపాలిటీ ఇక కార్పొరేషన్‌గా మారనున్నది. పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పది గ్రామాలను విలీనం చేసి నగరపాలక సంస్థగా అప్‌గ్రేడ్ చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే మున్సిపల్ అధికారులు ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించగా ఎమ్మెల్యే, ప్రభుత్వ పరిశీలన కోసం సమర్పించారు. తాజాగా కలెక్టర్‌కు ఆ ఫైల్ చేరగా డీపీవో, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్‌కు చేరగా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయం

నర్సంపేటలో 2011 లెక్కల ప్రకారం 37,500 జనాభా ఉంది. కానీ ఇప్పుడు 44,500కి పెరిగింది. గతంలో నర్సంపేటలో కమలాపురం, ద్వారకపేట, సర్వాపురం గ్రామాలు విలీనం కావడంతో నగర పంచాయతీగా, ఆ తర్వాత మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. తాజాగా కార్పొరేషన్‌గా మార్చేందుకు నర్సంపేట చుట్టుపక్కన ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను విలీనం చేయాలని నిర్ణయించారు. 60 నుంచి 80వేలకు పైగా జనాభాతో కార్పొరేషన్ చేయాలని సంకల్పించారు. మాదన్నపేట, నాగుర్లపల్లి, మహేశ్వరం, ముగ్ధుంపురం, రాజపల్లె, ముత్తోజీపేట, రాజుపేట, రాములునాయక్ తండా, పర్శునాయక్ తండా, పసునూరు గ్రామాలను విలీనం చేయడం వల్ల అనుకున్న జనాభా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ నుంచి మండల పరిషత్ కార్యాలయానికి, మున్సిపాలిటీకి ఫైల్ చేరగా వాస్తవ పరిస్థితులను అధికారులు అంచనాలు వేస్తున్నారు. కార్పొరేషన్ అయితే ఎక్కువ నిధులు తీసుకురావచ్చని భావిస్తున్నారు. ఈ ప్రక్రియ కూడా ఎన్నికలకు ముందే పూర్తి చేయాలని కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల్లోపు అయితే విలీనమయ్యే గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించరు. ఒకవేళ సాధ్యం కాకపోతే ఆయా గ్రామాలకు ఎన్నికలు నిర్వహించాల్సి వస్తుంది. ఎన్నికలు తర్వాత అయితే కౌన్సిలర్లు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే అధికారులు కావాల్సిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో సేకరించే పనిలో ఉన్నారు. అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఫైల్ తిరిగి ప్రభుత్వానికి చేరనుంది. జనాభా ప్రకారం నర్సంపేట ఏ స్థాయి మున్సిపాలిటీని కేటాయిస్తారనేది చర్చ కొనసాగుతున్నది.

## ఇద్దరు నకిలీ పోలీసుల అరెస్టు





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

జనగామ చౌరస్తా, అక్టోబర్ 7: పోలీసులమని చెప్పి ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జనగామ ఏసీపీ పార్థసారథి తెలిపారు. సోమవారం అర్బన్ పీఎస్‌లో వివరాలు వెల్లడించారు. దేవరుప్పుల మండలం గొల్లపల్లికి చెందిన నితిన్ తన స్నేహితులతో కలిసి ఈ నెల 5వ తేదీన రఘునాథపల్లి మండలం నిడిగొండలో మరో స్నేహితుడి చెల్లెలి ఫంక్షన్‌కు హాజరయ్యా రు. అదేరో జు రాత్రి 12 గంటలకు తిరుగు ప్రయాణం చేస్తుండగా యశ్వంతాపూర్‌కు చెందిన కాముని వినయ్ (30), యామంకి మధు (31) బైక్‌పై వచ్చి తాము క్రైమ్ బ్రాంచ్ పోలీసులమని బెదిరిస్తూ నితిన్‌తో పాటు అతడి స్నేహితులను కొట్టారు. వారి దగ్గరున్న రూ.500 నగదుతో పాటు ఫోన్ పే ద్వారా రూ. 800లను వారి ఖాతాలోకి మళ్లించుకున్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు. వారి నుంచి బైక్, రెండు సెల్‌ఫోన్లు, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## హోరాహోరీగా అథ్లెటిక్స్



జావెలిన్‌త్రో

**10వ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు**

- లాంగ్‌జంప్‌లో ఉమ్మడి వరంగల్‌కు చెందిన అంజి, డిస్కస్‌త్రోలో సునిత్‌కుమార్‌కు గోల్డ్ మెడల్స్
- నేటితో ముగియనున్న జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 7: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడి యంలో 10వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ముఖ్య అతిథిగా స్పోర్ట్స్ అండ్ అథారిటీ ఓఎస్డీ రవీందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. మొదటిరోజు అండర్-16, 18, 20 బాయ్స్ అండ్ గర్ల్స్‌కు డిస్కస్ త్రో, హైజంప్, 5000,10000 మీటర్ల రేస్‌వాక్, 800,1000 మీటర్ల పరుగు పందెం, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. అథ్లెట్లు ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా వారికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు స్టేన్లీ జోన్స్, కార్యదర్శి సారంగపాణి, కోశాధికారి రాజేశ్‌కుమార్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు వరద రాజేశ్వర్‌రావు, మూగల కుమార్‌యాదవ్, డాక్టర్ మురళీధర్, పగ డాల వెంకటేశ్వర్‌రెడ్డి, వంశీరెడ్డి మెడల్స్ అందజేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడా కారులను ఈనెల 25 నుంచి 29 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించే జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేస్తారు. కాగా, ఇటీవల చెన్నైలో జరిగిన ఎస్ఏఏఎఫ్ అథ్లెటిక్స్ గేమ్స్‌లో 800 మీటర్ల, 3000 మీటర్ల పరుగుపందెంలో సిల్వర్‌మెడల్ సాధించిన బీ వినోద్‌కుమార్, మోహిత్‌చౌదరికి అథ్లెటిక్స్ అసోసియేషన్ ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేల నగదు ప్రోత్సాహాన్ని అందించారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



600 మీటర్ల పరుగుపందెంలో అథ్లెట్లు..

### విజేతల వివరాలు..

**అండర్-18 బాయ్స్**

**డిస్కస్ త్రో** : జీ సునిత్‌కుమార్(జనగామ, గోల్డ్ మెడల్), పీ గౌతమ్(కామారెడ్డి, సిల్వర్ మెడల్), జీ వరుణ్‌గౌడ్(నిర్మల్, బ్రోంజ్ మెడల్)

**హైజంప్** : జీ వినయ్(భద్రాద్రి, గోల్డ్), పీ వెంకటేశ్వర్‌రావు(భద్రాది, సిల్వర్), బీ విష్ణు(మంచిర్యాల, బ్రోంజ్)

**5000 మీటర్స్ రేస్‌వాక్** : ఎడ్ల సాయిచరణ్‌రెడ్డి(నిజామాబాద్, గోల్డ్), అట్టమ్ జశ్వంత్(ఆదిలాబాద్, సిల్వర్), దూరిశెట్టి చంద్రసిద్ధార్థ(ఆదిలాబాద్, బ్రోంజ్)

**అండర్-20 బాయ్స్**

**800 మీటర్ల పరుగుపందెం** : ఎం ఈశ్వర్(కామారెడ్డి, గోల్డ్), శీలం గోపీచంద్(ఖమ్మం, సిల్వర్), ఎం అఖిల్(భద్రాది, బ్రోంజ్)

**షాట్‌పుట్** : ఏ సాయికిరణ్(వికారాబాద్, గోల్డ్), ఎస్ విదిత్‌రెడ్డి(హైదరాబాద్, సిల్వర్), ఎస్‌కే ఆఫ్తాబ్(ఖమ్మం, బ్రోంజ్)

**డిస్కస్ త్రో** : ఎస్ విదిత్‌రెడ్డి(హైదరాబాద్, గోల్డ్), కే స్వామి(కరీంనగర్, సిల్వర్), కోల రాహుల్(హైదరాబాద్, బ్రోంజ్)

**హై జంప్** : ఎం పవన్(భద్రాద్రి, గోల్డ్), బీకే శ్రీరాం(రంగారెడ్డి, సిల్వర్), బీ గణేశ్(భద్రాది, బ్రోంజ్)



**10000 మీటర్ల రేస్‌వాక్** : ఈ విష్ణువర్ధన్(కరీంనగర్, గోల్డ్), ఎండీ సోహైల్(జగిత్యాల, సిల్వర్), పీ అబ్దుల్‌కరీంబాషా(జోగులాంబ గద్వాల్, బ్రోంజ్)

**లాంగ్‌జంప్** : బీ అంజి(హనుమకొండ, గోల్డ్), నాగనాథ్(నిజామాబాద్, సిల్వర్), బొళ్ల బన్నీ(వనపర్తి, బ్రోంజ్)

**అండర్-18 గర్ల్స్.**

**షాట్‌పుట్** : కే రాజరాజేశ్వరి(నాగర్‌కర్నూల్, గోల్డ్), జీ సిరిరెడ్డి(రంగారెడ్డి, సిల్వర్), ఎం అక్షయసింధు(జనగామ, బ్రోంజ్)

**1000 మీటర్ల పరుగుపందెం** : ఏ అఖిల(నల్లగొండ, గోల్డ్), కే స్వప్న(నాగర్‌కర్నూల్, సిల్వర్), ఎం గౌరీప్రియ (రంగారెడ్డి, బ్రోంజ్)

**అండర్-16 బాయ్స్..**

**జావెలిన్‌త్రో** : ఎన్ శ్రీకాంత్(మెదక్, గోల్డ్), ఆర్ వంశీ(ఆసిఫాబాద్, సిల్వర్), పీ సతీశ్‌కుమార్ (ఆదిలాబాద్, బ్రోంజ్)

**లాంగ్‌జంప్** : జీ రాజేశ్(రంగారెడ్డి, గోల్డ్), కే ఉదయ్‌కిరణ్(నాగర్‌కర్నూల్, సిల్వర్), కే ఆనంద్(కామారెడ్డి, బ్రోంజ్)

**అండర్-16 గర్ల్స్.**

**షాట్‌పుట్** : ఎస్‌కే అఫ్రీన్(భద్రాద్రి, గోల్డ్), ఎం అనిగౌడ్(మేడ్చల్, సిల్వర్), కే రేవతి(వికారాబాద్, బ్రోంజ్)

**అండర్-20 గర్ల్స్..**

**800 మీటర్ల పరుగుపందెం** : డీ కల్యాణి(సూర్యాపేట, గోల్డ్), ఎం టబు(భద్రాద్రి, సిల్వర్), జీ ఉషారాణి(జోగులాంబ గద్వాల్, బ్రోంజ్)

**షాట్‌పుట్** : ఎన్ బుచ్చమ్మ(నాగర్‌కర్నూల్, గోల్డ్), సీ వసంత(ఆదిలాబాద్, సిల్వర్), ఏ లక్ష్మీప్రసన్న(హనుమకొండ, బ్రోంజ్)

**200 మీటర్ల పరుగుపందెం** : ఎన్ ప్రవళిక(నల్లగొండ, గోల్డ్), ఎం శ్రీనివాస్(రంగారెడ్డి, సిల్వర్), మాల శృతి(నాగర్‌కర్నూల్, బ్రోంజ్).



బాలికల లాంగ్‌జంప్





డిస్కస్ త్రో, బాలికల 600 మీటర్ల పరుగుపందెం